# చిటపటలు

ఆలేటి నాగమణి

పేర్రాజుకు కసిగా వుంది. ఆఫీసుకు వచ్చాడన్న మాటేగాని వసుంధర అన్నమాటే చెవుల్లో గింగుర్లెత్తుతోంది.

ఎంత తేలిగ్గా అనేసింది. తాను...తాను వసుంధర దృష్టిలో ఎంత చులకనైపోయాడు. పెళ్ళయి ఆరేళ్ళు దాటాయి. అవును...ఇది ఏడో సంవత్సరం. ఈ ఆరేళ్ళలో తెలుసుకోలేని నిజాన్ని ఈ ఏడో యేడు తెలుసుకున్నారు. చాలా ఆలస్యంగా....ఏం చేయగలడు? ఏం చేయలేని స్థితిలో వున్న తాను...వసుంధర మాటను మర్చిపోగలిగే శక్తిలేని బలహీనుడైపోయాడు.

"ఈ యేడేళ్ళుగా తాను వసుంధరపట్ల పెంచుకున్న అభిప్రాయం అంతా...వొట్టిదే! వసుంధర ప్రేమ, అభిమానం అంతా నటన. తను మోసపోయాడు...అవును" పేర్రాజు పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు.

"సార్...ఆఫీసరుగారు పిలుస్తున్నారండి!" ప్యూన్ వచ్చి పిలవటంతో, ఫైల్ ఎదురుగా పెట్టుకొని ఆలోచిస్తున్న పేర్రాజు ఉలిక్కిపడుతూ లేచి వెళ్ళాడు.

"ఎన్నాళ్ళయిందండీ మీరు సర్వీస్‌లో చేరి?" సీరియస్‌గా అడుగుతున్న ఆఫీసరుగారి ప్రశ్నకు తడబడిపోతూ, "ఏడేళ్ళు" అన్నాడు మెల్లిగా

"ఏడేళ్ళు...ఆ మాట చెప్పడానికి మీకు సిగ్గు వేయడంలేదూ! నిన్నగాక మొన్న చేరిన క్లర్కు గోపాలం డ్రాఫ్ట్ ఎలా రాశాడో చూడండి ఒక్క తప్పులేకుండా...మీ డ్రాఫ్ట్ చూడండి...ఆఫీసుకు ఎందుకు వస్తారండీ? సరదాగా గడపడాని ఆలోచిస్తూ ఊహాలోకాల్లో తేలిపోవడానికా?" గట్టిగా అడిగాడు.

"ఏదో పొరపాటైపోయిందండీ! ఈ ఒక్కసారికీ..."

"ఒక్కసారి...ఏడేళ్ళుగా చూస్తున్నాను. 'ఒక్కసారి' అనే పదానికి అర్థం తెలుసుకోవడానికయినా ప్రయత్నించవేం? ఏడేళ్ళుగా ఏ ఒక్కసారైనా డ్రాఫ్ట్ సరిగ్గా రాశావుటయ్యా నువ్వు?"

ఆఫీసరు సంభాషణ బహువచనంలో నుండి ఏకవచనంలోకి మారడం గ్రహించలేదు పేర్రాజు అతని ఆలోచనంతా మరోవైపు...

కాని ఏడేళ్ళుగా ఏ ఒక్కనాడైనా తను డ్రాఫ్ట్ లెటర్ సరిగ్గా రాయలేదూ? ఇలా మాట్లాడతాడేం? అతనే...తనను ఎన్నిసార్లు మెచ్చుకోలేదూ? స్టాఫ్ అందరిలోకల్లా తాను కష్టపడి పనిచేస్తానని వర్కింగ్ అవర్స్‌లో కాలాన్నీ ఏ మాత్రం దుర్వినియోగం చేయకుండా పని చేస్తానని కదూ చాలాసార్లు అన్నాడు. మరి ఈరోజు...

అంటే—

నిజానికి తనపట్ల అతనికున్న సరియైన అభిప్రాయం ఇదన్నమాట! ఇన్నాళ్ళు మాట్లాడినదంతా అబద్ధం అనేకదూ! మెరమెచ్చు కోళ్ళే కదూ...ఛ...ఏం మనిషి?

పేర్రాజు ఆఫీసరు పిలుపుకు కాదు, అరుపుకు ఆలోచిస్తున్న పేర్రాజు హడలిపోతూ చూశాడు

**ఎందుకలా ఉరిమిచూస్తారూ? నేనేమంత తప్పుగా అన్నానని, వెధవ జానెడు పొటకు గుప్పెడు మెతుకులు ముష్టిలా పెడుతున్నారు. అంతే! దాంతో బాధ్యత తీరిపోయిందనుకుంటారు. మరినాకోరికలు, ఆశలు...?**

"నిలబడే నిద్రపోతున్నారా ఏమిటి? ఖర్మ... ఛ...ఇటువంటి స్టాఫ్‌ని ఎక్కడా చూళ్ళేదయ్యా! ఛ...ఛ..." అంటూ విసుక్కుని, "మరో ఐదు నిమిషాల్లో సరిగ్గా రాసి తీసుకురండి" అంటూ ఫైలు విసిరేశాడు.

గాలిలో తేలిపోతున్న ఫైలును అందుకుని సీటు దగ్గరికి వచ్చాడు పేర్రాడు.

పేర్రాజుకు మళ్ళీ వసుంధర మాటలు గుర్తుకు వచ్చాయి.

"ఏడేళ్ళ సంసార జీవితంలో ఏ ఒక్కనాడు నన్ను సుఖపెట్టారూ? ఒక్క మంచి చీర కొనిచ్చారా? ఒక్క కొత్త నగ చేయించారా? ఉమా అమ్మవాళ్ళు పెట్టిన నగలన్నీ ఊడ్చేయటం తప్ప. చేతకానితనం...పైగా బోలెడంత కోపం? ఎందుకు? ఏం చూసుకుని అలా విర్రవీగుతారు?"

"............"

"మా మాస్టారూ అంటుండేవారు 'అసమర్థులకు వుండేది. చేతనయేది ఆదొక్కటేనని"

............

"ఎందుకలా ఉరిమిచూస్తారూ? నేనేమంత తప్పుగా అన్నానని. వెధవ జానెడు పొట్టకు గుప్పెడు మెతుకులు ముష్టిలా పెడుతున్నారు. అంతే! దాంతో బాధ్యత తీరిపోయిందనుకుంటారు. నా కోరికలు, ఆశలు అన్నీ సమాధి చేశాను. ఎందుకంత రోషపడతారూ? ఈ బతుక్కి అదొక్కటే తక్కువైంది..."

............

"కొడతారా ఏం? కొట్టండి. 'చేతకానమ్మకు మాటలెక్కువ, చెల్లని రూపాయికి గీతలెక్కువ' అని కొట్టండి. మీ సమర్థత, గొప్పతనం అందరికీ తెలియాలిగా మరి!"

............

"ఈ వెధవ సంసారం చేయలేక, ఈ దరిద్రపు పిల్లలతో వేగలేకపోతున్నాను. ఒక సరదా, సంతోషంలేదు ఎప్పుడూ ఈ నరకంలోనే పడి చావాలి? ఆ చావుకూడా త్వరగా రాదు" –

పేర్రాజు తల గట్టిగా విదిల్చి, డ్రాఫ్ట్ రాసి పంపించాడు. అతని బుర్ర ఆలోచించటం మానేసింది. చెవుల్లో వసుంధర మాటలే గింగుర్లెత్త సాగాయి.

అయితే–వసుంధర కూడా ఆఫీసరులానే ఎన్ని మాటలంది.

గడిచిన ఏడేళ్ళ జీవితంలో ఎన్నోసార్లు మాటామాటా అనుకున్నారు కాని...వసుంధర ఏనాడూ ఇంత సీరియస్‌గా అన్లేదు. తనను పరుషంగా ఒక్కమాట అన్లేదు.

మరి...ఇవాళ...ఇన్నాళ్ళకు.

ఎందుకలా అంది?

నిజంగా తనపట్ల వసుంధర మనసులో వున్న అభిప్రాయం అదేనా? అదే అయితే యిన్నాళ్ళ వసుంధర సహచర్యంలో తాను గడిపిన జీవితం అంతా మోసం. వంచన. వసుంధర నటించిందా? లేదు...లేదు. వసుంధర అలాంటిది కాదు.

పేర్రాజు యింటికి వచ్చేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ప్రతి రోజులాగే వసుంధర ఎదురు రాలేదు. ఇంట్లో పోట్లాట జరిగినప్పుడల్లా అలా జరగడం మామూలే.

పేర్రాజు మౌనంగా గదిలోకి వెళ్ళి బట్టలు మార్చుకొని, అక్కడేవున్న వాలుకుర్చీలో కూర్చున్నాడు. చిన్నపిల్లలిద్దరు అప్పుడే నిద్రపోయారు. పెద్దమ్మాయి మాత్రం టేబుల్ దగ్గర దీక్షగా రాసుకుంటోంది.

వసుంధర కాఫీ కప్పుతోపాటు ఓ కవరు తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టి వెళ్ళిపోయింది.

తండ్రికి డబ్బు పంపి వారం రోజులవుతోంది బహుశా అందినట్టు రాసివుంటారనుకుంటూ, కాఫీ తాగి సిగరెట్ వెలిగించాడు.

పది నిమిషాలు భారంగా గడిచిపోయాయి. సిగరెట్ చివరికంటా కాలిపోయింది.

పేర్రాజు కవరు అందుకున్నాడు. ఇన్‌లాండ్ కవరు చించకుండా వుండడం చూసి, "వసుంధర చదవలేదన్న మాట" అనుకున్నాడు. వెంటనే అతనికి వారం రోజుల క్రితం వసుంధర అన్నమాట గుర్తుకొచ్చింది.

"మీ నాన్న రాసిన వుత్తరం నేచించి చదవకూడదా? ఏం ఎందుకని? అంత రహస్యాలు ఏముంటాయ్? ఆ ఉత్తరం మొదటినుండి చివరికి డబ్బు పంపమనే యావతప్ప మనం ఎలా వున్నామో అన్న ఒక్కమాట వుండదు. ఏడేళ్ళ కాపురంలో నేనింకా మీకు పరాయిదాన్నే. ఈ సారి ఉత్తరాన్ని చించను" అంటూ వెక్కివెక్కి ఏడ్చింది.



నిజానికి వసుంధర వుత్తరం చదివినందుకు, చించినందుకు కాదు. ఆ ఉత్తరంలో తండ్రి, కోడలు ఏదో కొడుకును మార్చేసిందంటూ పిచ్చి పిచ్చిగా రాస్తాడు. అది చదివి వసుంధర బాధ పడుతుందనే ఆ వుత్తరం చించకూడదన్నాడు. కాని, వసుంధర అర్థం చేసుకోదు. అసలు తన అభిప్రాయం ఎందుకు చదవకూడదన్నాడో విడమరిచి చెప్పినా 'నిజం' అని నమ్మదు. ప్చ్... ఏం మనిషో.

పేర్రాజు ఉత్తరం చించి చదివాడు.

చిరంజీవి రాజుకు,

నీవు పంపిన మనీ ఆర్డరు అందింది. ఈ నెల నుండి ఓ పాతిక రూపాయలు ఎక్కువ పంపించమని క్రితంసారి ఉత్తరంలో రాసాను, కాని ప్రతి సారిలాగే నువ్వు వంద రూపాయలే పంపించావు. నెలకో వంద రూపాయలు పంపించగానే నీ బాధ్యత తీరిపోయినట్టు భావించకు. నీ చదువు కోసం నేనెంత కష్టపడ్డానో ఆ భగవంతుడికే తెలుసు. నీ చదువుకోసం ఎంత అప్పుచేశానో నీకు తెలుసు. ఎందుకంటావ్? నువ్వు మంచిగా చదువుకొని ఉద్యోగస్థుడివి అయితే మా శేష జీవితాలు హాయిగా గడుస్తాయనే కదూ! ఏ చీకూచింతా లేకుండా మా ముసలి ప్రాణాలు నీ నీడలో ప్రశాంతంగా గడుస్తాయనేగా అప్పుడు మా కడుపులు మాడ్చుకొని, నిన్ను చదివించి ప్రయోజకుణ్ణి చేసాను. కాని, ఈనాడు నువ్వు రెక్కలు వచ్చిన పక్షిలా ఎగిరిపోయావు. ఏదో నెలకింత ముష్టిలా మా మొహాన ఓ వంద రూపాయలు పంపుతున్నావు. అంతే. మళ్ళీ నెలవచ్చేవరకూ మా గురించి ఆలోచించవు. మీ సరదాలకు, కోరికలకు ఏ మాత్రం లోటు లేకుండా చూసుకుంటావు. నీ భార్యా పిల్లల కోరికలు తీర్చడమే నీకు కావల్సింది. కని, పెంచి, కష్టపడి నిన్నింత ప్రయోజకుణ్ణి చేసిన తల్లిదండ్రుల సుఖ సంతోషాలతో నీకేం బాధ్యత వుండదు. ఒక్కపాతిక రూపాయలు ఎక్కువ పంపమని రాసేసరికి పంపించలేకపోయావు. నువ్వు నీ భార్యతో కలిసి ఒక్క సినిమాకు వెళ్ళే అయ్యే ఖర్చు మా గురించి మానుకోలేకపోయావూ వురా అంటే నువ్వెంత స్వార్థపరుడివో అర్థ

మైంది. నీ గురించి ఎంతో గొప్పగా చెప్పుకొని మురిసిపోయానో తలచుకుంటే ఈనాడు సిగ్గు కలుగుతోంది రాజూ! నీకూ పిల్లలున్నారు! రేపు వాళ్ళు ఇలాగే చేస్తారు! శపించడం లేదు. కాని..."

ఆ తరువాత వుత్తరం చదవలేకపోయాడు పేర్రాజు. ఉత్తరం అంతా నిందా వాక్యాలు... నిష్ఠూరాలు. వసుంధర చించి చదివితే ఎంతగా బాధపడిపోయేది! ప్చ్.

కాని...నిజానికి తాను సుఖపడుతున్నాడా? తన భార్యాబిడ్డల కోరికలు తీరుస్తున్నాడా? తాను స్వార్థపరుడా? ఉత్తరం చివరికంటా చదివారు.

ఉత్తరం చదవడం పూర్తిచేసి గాఢంగా నిట్టూర్చాడు పేర్రాజు. అతని మనసంతా భారంగా అయిపోయింది. కుర్చీ వెనక్కివాలి కళ్ళు మూసుకున్నాడు. అతని కనుకొలుకుల్లో నిండిన నీళ్ళు నిశబ్దంగా జారిపోసాగేయి.

స్వార్థపరుడు—తను స్వార్థపరుడు.

తండ్రి ఎంత తేలిగ్గా అనేసాడామాట. ఆమాట తనను అనేముందు ఒక్కసారి వెనక్కితిరిగి ఆలోచించుకున్నాడా? ఆలోచిస్తే చక్కటి జవాబు దొరికేది.

తండ్రి తన జన్మకు కారణం. ఒప్పుకుంటాను. కాని తను పుట్టిన మరుక్షణం నుండి, తనకైన ఖర్చు అంతా, లెక్కలరూపంలో తండ్రి మనసులో రోజురోజుకు కూడికలు...కూడికలు...గా పెరిగి పెరిగి వడ్డీలా, చక్రవడ్డీలా పెరగసాగాయి. తనకు ఊహవచ్చి ప్రపంచాన్ని కొంచెం కొంచెంగా అర్థం చేసుకుంటున్న మరుక్షణం నుండి "నేను నీ తండ్రిని. నిన్ను కని పెంచిన వాణ్ణి. నిన్ను కనడం, పెంచడం...నిన్ను ప్రయోజకుణ్ణి చేయడం, కేవలం నీ భవిష్యత్తు బాగుండాలనే కాదు, రేపు మా ఇద్దరిని, నువ్వే పోషించాలి ఈ నాడు కష్టపడి నిన్ను పెంచుతున్నామంటే, రేపు మమ్మల్ని నువ్వు అలాగే పోషించాలి. నువ్వు ఋణగ్రస్తుడివి. నీ జీవితాంతం మాకు ఋణ పడి వుండాలి" అని పదే పదే హెచ్చరిస్తూ తనకు జ్ఞాపకం చేసేవాడు. ఒక కాబూలీవాలాలా ఇంటికి ఎవరొచ్చినా "మావాడి చదువుకి ఇంత ఖర్చవుతోందండి. అయితే ఏం, రేపు నాడు సంపాదించి తప్పకుండా మమ్మల్ని పోషిస్తాడు. పోషించి తీరాలికూడా" ఇలా వుండేది ఆయన వాగ్ధోరణి.

మొదట్లో కన్నకొడుకు మీద ఆ మాత్రం ఆశ పెంచుకోవడం సహజమే అన్నట్టుగా ఊహించుకొని ఒక్కసారి గర్వంగా తల ఎగురవేసేవాడు. కాని, రాను రాను అతని ధోరణి తన పట్ల చాలా దారుణంగా పరిణమించసాగింది. తనకోసం ఖర్చుపెట్టే ప్రతిరూపాయి గురించి తానెంత కష్టపడి సంపాదిస్తోంది వివరంగా చెప్పి, రేపటి తన బాధ్యతను గుర్తుచేస్తూ ఉండేవాడు.

వసుంధరను పెళ్ళిచేసుకున్నాడన్నమాటేగాని, ఆలోచిస్తే ఆమె కోరికలు, ఆశలు ఏవీ తీర్చలేకపోయాడు. తాను తెచ్చిన కట్నం డబ్బుతో యిల్లును అందంగా తీర్చిదిద్దాలనుకుంది. అది తన తండ్రి దయవల్ల వీలుకాలేదు. అందుకు ముందుగా బాధపడ్డా ఆ తరువాత ఆ విషయాన్నే మరిచిపోయింది.

పెళ్ళయిన ఓ సంవత్సరం ఆనందంగానే గడిచిపోయింది. ఆ తరువాత వరసగా పిల్లలు—అవసరాలు పెరిగాయి. ఖర్చులు పెరిగాయి కాని తండ్రికి పంపే డబ్బు ఆపడం వీలుకాలేదు. కాస్త తగ్గించాడు. అదీ పెద్ద రాద్ధాంతం అయింది. తనకున్న ఖర్చులు, అవసరాలు, అన్ని ప్రక్కకునెట్టి నెలకు వంద రూపాయలు పంపినా తండ్రి ఒక్కనాడు తృప్తిపడలేదు.

వసుంధర- తనను అర్థం చేసుకుందని, తన బాధను గురించి ఓదారుస్తుందనుకున్న వసుంధర ఈనాడు ఎంతమాట అనేసింది.

తను అసమర్థుడు

చేతకానివాడు.

అసలు ఉదయం జరిగిందంతా తలచుకుంటే తనకే ఆశ్చర్యం వేసింది. వసుంధర ఏనాడూ ఏడేళ్ళగా అనని మాట అనేసింది. ఏనాడులేని దివాళ ఆఫీసరు... ఒహో...

ప్చ్...

"నాన్నా!" పెద్ద పాప పిలుపుకు తలెత్తి చూసాడు.

"అమ్మ భోజనానికి రమ్మంటోంది నాన్నా!"

"ఊహుఁ... ఆకలిగా లేదమ్మా! మీరు తినేయండి!" అన్నాడు.

పాప వెళ్ళిపోగానే భారంగాలేచి, మంచం మీద వాలిపోయాడు పేర్రాజు. అతనికి నిద్రరాలేదు. గట్టిగా కళ్ళుమూసుకున్నాడు

ఆఫీసరు మాటలు ఓ ప్రక్క, వసుంధర మాటలు మరో ప్రక్క అతణ్ణి స్థిమితంగా వుండనీయడంలేదు. ఆఫీసరు అన్నదానికి అతనంతగా బాధపడకపోయినా, అతని మనసు వసుంధర మాటలు గుర్తుకువచ్చినపుడల్లా, విలవిల్లాడిపోసాగింది.

వసుంధరకు తానేమి యివ్వగలుగుతున్నాడో ఏమి ఇవ్వలేకపోతున్నాడో తనకు తెలుసు అంతే కాదు, వసుంధర తాను యిచ్చినదాంతోనే సంతృప్తిపడిపోయి, తనను అర్థం చేసుకొని మసలుతోందనితెలిసి, మనసులోనే తన అదృష్టానికి పొంగిపోయాడు. ఏనాడు వసుంధర మాటలో నడవడిలో తన పట్ల అసంతృప్తి కనపరచలేదు



## తెలుగు సం॥లు

"తెలుగు సంవత్సరాల పేర్లు చెప్పరా కృష్ణా!" అడిగారు మాస్టారు.

"మహిళా సంవత్సరం, బాలల సంవత్సరం, వికలాంగుల సంవత్సరం......" చెప్పడం మొదలెట్టాడు కృష్ణ.

—బి. ఎ. రాజు (ఆమదాలవలస)

మరో రోజు —బిందు





## తిరుగుడు

"సుబ్బారావు నీ కోసం తెగ తిరుగుతున్నాడేమిటి?" అడిగాడు రామారావు, అప్పారావుని.

"అప్పు తీసుకోక ముందు వాడి కోసం నేను తిరిగానులే" చెప్పాడు అప్పారావు.

—ఎన్. సత్యనారాయణ (గడసాం)

తననెంతగా ప్రేమించిందో, అభిమానించి గౌరవించిందో తనకే తెలుసు. తాను చాలా అదృష్టవతుడిననుకొని మురిసిపోయాడు.

ఏనాడు నాకిదికావాలని అడగలేదు వసుంధర.

ఎవరైనా ఏదైనాకొన్నప్పుడు "నీకు కొనివ్వలేకపోతున్నాను వసూ!" అని తాను బాధపడిపోతె చాలా తేలిగ్గా నవ్వేస్తూ, తనను ఓదార్చేది తప్ప సాధించేదికాదు. పిల్లలుపుట్టి అవసరాలు పెరిగాకకూడా, ఉన్నదాంట్లో అతిపొదుపుగా సంసారాన్ని సాగించే వసుంధర–

ఈ రోజు ఏం జరిగిందని? ఎందుకలా అనేసింది?

ఏది ఏమైనా యిన్నాళ్ళు మనసులో తన పట్ల ఆమె పెంచుకున్న అభిప్రాయం బయటికివచ్చింది.

తన అసమర్ధతను, చేతకానితనాన్ని, బలహీనతను అన్నిటిని నిలదీసింది.

అది ఏనాడూ వసుంధర నుండి తాను ఆశించని ఎత్తిపొడుపు, అవహేళన...

కాని– తానేం చేయగలడు.

మధ్యతరగతి సగటుమనిషి... అవన్నీ బిరుదులుగా ధరించి, భరించాలెతప్ప ఏంచేయగలడు?

అలా ఆలోచిస్తున్న పేర్రాజు కళ్లలో అనుకోకుండా నీళ్ళు తిరిగాయి.

తనకు తెలుసు తానేమిటో తనకు బాగా తెలుసు. యిటు పిల్లల అవసరాలు, సంసార బాధ్యత అటు తండ్రికి పంపాల్సిన డబ్బు– పైగా నిష్ఠూరపు మాటలు– నలుగురి మధ్య తాను ఓ మామూలు గుమస్తాగా మిగలడం– అన్నీ గుర్తుకు వచ్చి, బాధపడిపోతే–

నేనున్నాను మీకు తోడుగా... మీరు అవన్నీ మర్చిపోండి కాసేపు... అంటూ తన గుండెల్లో దాచుకొని, ఓదార్చే వసుంధర... తనను ఎన్ని మాటలు అంది.

ఆమె పరిష్వంగంలో తనఉనికిని. అస్థిత్వాన్ని మరిచిపోయి ప్రశాంతంగా గడిపే ఆ క్షణాలు... ఏవి? అవన్ని ఎదురుతిరిగే మనసును అదిమి కదూ వసుంధర తనను వంచించింది.

కాని– తనొక పిచ్చివాడు.

కనిపెంచిన తల్లి, తండ్రి తమ ప్రేమను డబ్బుతో కొలుస్తూ వుంటే, ఎక్కడో పుట్టి, పెరిగి ఇరవై యేళ్ళ తన జీవితాన్ని మనసును తనకు అర్పించి, కోటికోర్కెలతో గుండెనిండా ఆశలతో తనను పెళ్ళాడి, తన జీవితంలోకివచ్చిన వసుంధర తన గురించి యిలా ఆలోచించడంలో తప్పేం వుంది?

పేలవంగా నవ్వుకున్నాడు పేర్రాజు. నవ్వినా అతని కళ్ళనిండా నీళ్ళు నిండుకున్నాయి.

గదిలోకి వసుంధర వచ్చిన అలికిడి కావడంతో తన కన్నీళ్ళు కనిపించకుండా అటువైపుకు తిరిగి దిండులో మొహం దాచుకున్నాడు.

వసుంధర లైటు ఆర్పేసి పడుకుంది.

ఆ పూట పేర్రాజుతోపాటు వసుంధర అన్నం తిన్లేదు.

ఉదయం మామూలుగా నిద్రలేచాడు పేర్రాజు. తన కాలకృత్యాలకు, కార్యక్రమాలకు ఎటువంటి లోపం, అంతరాయం కలగలేదు. మామూలుగా కంటే కూడా పోట్లాడుకున్నప్పుడు వసుంధర తన పనులన్నీ చకచకా చేస్తుంది.

ఆఫీసుకు టైమవడంతో భోజనం వడ్డించింది.

"నాన్నాలు... అమ్మ పిలుస్తుంది!" అంటూ వచ్చాడు చిన్న.

వెళ్ళి కంచంముందు కూర్చున్నాడు. వసుంధర అన్నీ కంచం దగ్గరగా అమర్చి వెళ్ళిపోయింది.

రాత్రి తిననందుకేమో ఆకలిగా వుండడంతో గబగబా భోజనంచేసి ఆఫీసుకు తయారవుతుంటే చిన్న వచ్చాడు.

"నాన్నాలు...అమ్మ ఊ రెల్లుతుందట."

అన్నాడు.

"వెళ్తే వెళ్లమను" అన్నాడు కోపంగా.

"మమ్మల్ని తీసికెళ్లమంతావా?"

"వద్దు..." అంటూ విసురుగావెళ్ళిపోయాడు.

"ఊరెళ్లుతుందట ఊరు... భయపెట్టిస్తోంది? వెధవ సంసారం... వెధవ కొంప..." గొణుక్కున్నాడు.

మధ్యాహ్నం వరకు అదోలా వుండిపోయాడు పేర్రాజు.

ఆ తరువాత అతనికెందుకో మనసులో ఏ మూలో భయంలాంటిది కలగసాగింది.

వసుంధర అలా ఎన్నడూ అన్లేదు. అన్నదీ అంటే... ఓవిధంగా దృఢనిశ్చయానికి వచ్చినట్టేగా.

వెళ్ళిపోతుందా?

నిజంగా వెళ్తుందా?

తనను వొదిలి వుండగలదా వసుంధర.

పిల్లల్ని తీసికెళ్ళమంటారా అని అడిగిందంటే తనను వొదిలి వుండగలననే కదా!


కాని... తను... వుండగలడా, ఆ ఆలోచనే భరించలేకపోతున్నాడు... ఎలా?

నాలుగు దాటుతుండగా ఆఫీసరుగారు పిలిచారంటూ ప్యూన్ రావటంతో "మళ్లీ ఏంవచ్చిందో" అనుకుంటూ వెళ్ళాడు.

"రండి రాజుగారూ!" చాలా మర్యాదగా పిలిచాడు.

నిన్నటికి యివాల్టికి ఎంత తేడా? అనుకుంటూ

**అదీ కారణం** —పండరినాధ్



విస్తుపోయాడు పేర్రాజు.

"హార్టీ కంగ్రాచ్యులేషన్స్"... అంటూ చేయి అందుకొని "మీకు ప్రమోషన్‌వచ్చింది"అన్నాడు.

క్షణంసేపు పేర్రాజు మనసు మూగవోయింది ఆనందంతో.

నిముషాల్లో ఆ వార్త సెక్షన్ అంతా తెలిసి పోయింది.

"మీలాంటి హార్డ్ వర్కర్‌కు రావలసిందేనండీ! మీ కృషి ఫలించింది. నాకు చాలా సంతోషంగా వుంది. ఇంత చిన్న వయసులోనే మీరు గ్రేడ్ టూ ఆఫీసరుగా ప్రమోషన్ రావడం. ఓహ్..."అంటూ తన గురించి, తను పనిపట్ల చూపించే శ్రద్ధ గురించి, పదిమందిలో పొగిడి అందరికీ టీ పార్టీ యిచ్చారు ఆఫీసరు తన డబ్బుతో.

ఆశ్చర్యంగా నిలబడిపోయాడు పేర్రాజు.

ఆఫీసు అయిపోగానే—

అతను పరుగులాంటి నడకతో బస్ స్టాండు చేరుకుని, బస్సుకోసం వెయిట్ చేయకుండానే, ఆటో ఎక్కి యిల్లు చేరుకున్నాడు.

ఇంటికెళ్ళేసరికి, వసుంధర లోపల ఎవరితోనో మాట్లాడుతోంది.

"మావారు చాలా మంచివారే శశీ! నన్ను ప్రాణంగా చూసుకుంటారు. పాపం! మా గురించి కష్టపడిపోతారు. కానీ వెధవ గొర్రెతోక జీతం. మా మావయ్యవాళ్ళకు మావారొక్కరే! మరి మేమేకదూ ఆధారం! అటు వాళ్ళను చూసుకోవాలి, ఇటు మమ్మల్ని చూసుకోవాలి.

"మా పెళ్ళప్పుడుకదూ ఆయన్ని చూశావ్ నువ్వు! ఓహ్...అప్పటికీ యిప్పటికీ మనిషి ఎంతగా మారిపోయారని. ఎంతగా బక్కచిక్కిపోయారని. ఏమిటో వెధవ సంసారం అని నేను విసుక్కుంటానేకాని, ఆయన ఒక్కనాడూ విసుక్కోలేదు"

"చాల్లేవే! వచ్చినప్పటినుండి బావగారి గురించి గొప్పలు చెప్పడమేనా? మరేదైనా మాట్లాడవూ?"

"నా సంసారం...నా పిల్లలు, మావారుతప్ప యింకెవరి గురించి మాట్లాడాలంటావ్?"

"నువ్వు యిలా అంటున్నావ్‌కానీ...ఉష అయితే యిప్పటికి తానెన్ని చీరలు కొంది, ఎన్ని నగలు చేయించుకుంది ? నన్నెలా వేధించి మరి సాధించిందో చెప్పేది"

"ఉష మరీ బాధ్యత తెలియని చిన్నపిల్ల ! మొదట్లో నేనూ అలాగే వుండేదాన్ని. ఇదుగో ఈ పిల్లలు, ఈ సంసారం అన్నీ కుదిరాక వాటి గురించి అసలు ఆలోచనే రాదు. సరేగాని మీ బావ గారు వచ్చే వేళయింది. టిఫిన్ చేస్తాను. ఈ పూట భోజనంచేసి వెళ్ళరా! లేకపోతే నేను పెళ్ళికిరాను"

పేర్రాజుకు అర్థమైంది ఎవరొచ్చారో, వసుంధర పినతండ్రిగారి అబ్బాయి శశిధర్.

పేర్రాజు లోపలికెళ్ళేసరికి వసుంధర వంటింటిలోకి వెళ్ళింది. కుశలప్రశ్నలు అన్నీ అయ్యాయి.

ఆ రాత్రి శశిధర్ భోజనంచేసి, రాత్రి బండికే వెళ్ళిపోయాడు.

ఆ రాత్రి రెండు అరచేతులు తలక్రింద పెట్టుకొని ఆలోచిస్తున్న పేర్రాజు దగ్గరగా వచ్చింది వసుంధర. పేర్రాజు గమనించనట్టే, ప్రక్కనే పడుకున్న బుజ్జిగాడితో మాట్లాడుతూ—

"రేయ్ బుజ్జిగా! ఈ చేతకానివాడికి ప్రమోషన్ వచ్చిందిరోయ్! ఆఫీసరయ్యాడు" అన్నాడు.

వసుంధర చటుక్కున అతని నోరు మూసింది.

"నన్ను క్షమించండి, ఏమిటో వెధవకోపం. పిచ్చిపిచ్చిగా వాగాను. అసలు వెంటనే క్షమాపణ అడగాలనుకున్నాను. కాని..."

"చేతకానివాడు ప్రయోజకుడయ్యాడనా".

"ఛ...ఇప్పుడు నేనే ముందుగా క్షమాపణ అడగాలని వచ్చేసరికి మీరు...బుజ్జిగాడితో"

"ఊ...ఎలాగైతేనేం ఇన్నాళ్లుగా ఇన్నేళ్ళుగా నీ మనసులో దాచుకొని అనలేని మాటను అనేసావు"

"కాదు. నా మనసులో మీ పట్ల అలాంటి భావం ఈనాటికి లేదు. అసలు...ఏదో కోపం నాకే తెలియదు. నిన్న ఎందుకలా అరిచానో... మిమ్మల్ని చాలా బాధ పెట్టానుకదూ. పాపిష్టి దాన్ని"

"..............."

"నామీద మీకు కోపంగా వుందికదూ ! నాలుగు తిట్టండి అంతేకాని...నిన్నరాత్రి మీరు కళ్ళనీళ్ళు పెట్టుకోవడం...ఉహూ... నా జన్మలో మళ్ళీ అలాంటి క్షణం రాకూడదు. రానీయను" అంది అతని మొహాన్ని రెండు చేతులతో దగ్గరికి లాక్కుంటూ.

"ఇదంతా ప్రేమేనా ?"

"ఊ...కాదు గౌరవం అభిమానం...అన్నీ"

"ఎందుకో. నీకు నేనేమి ఇవ్వగలను వసూ దీనికి బదులుగా నేను"

"ఉష్...మీ గుండెనిండా నా పట్ల ప్రేమ చాలు అది. మరింకేం నేను కోరను" అంది మృదువుగా.

పేర్రాజుకు అర్థం కాలేదు. నిన్నటి ఆఫీసరు మాటల్లో కోపం, ఈనాడు...మరోటి. అలాగే వసుంధర మాటలు ఇదేమిటి ? ఎందుకిలా జరిగింది ? వసుంధరను అడిగాడు.

"ఎందుకంటే ఇది జీవితం కనుక. ఏం జరక్కుండా సాఫీగా సాగిపోతే జీవితానికి అర్థం తెలీదు. అందం వుండదు. వియోగం తర్వాత కలయిక ఎంతో హాయిగా వుంటుంది. ఇవన్ని తాబోయే చల్లదనానికి ముందుగా కురిసే చిటపటలు" అంది వసుంధర. ✱



## గెస్టు

హోటల్ మోహినీలో బసచేశాడు బల్వంతరావు.

అతనికి తెల్ల కాయితం అవసరమైంది.

హోటల్ గుమాస్తానడిగాడు.

"మీరు ఈ హోటల్‌లో గెస్టుగా వున్నారా?" అడిగాడు గుమాస్తా.

"నేనేం మీకు గెస్టుని కాను; రోజుకి డెబ్భై అయిదు రూపాయలు చెల్లిస్తున్నా..." కోపంగా అన్నాడు బల్వంతరావు

—జి.ఎస్. శర్మ (అమలాపురం)


డా॥ పి. వి. కె. రావు / B.A.
వైద్యవిద్వాన్ వైద్యాచార్య, సెక్సు స్పెషలిస్టు
వివాహము వాయిదా వేయ నవసరములేదు



హస్తప్రయోగం, నరముల బలహీనత శీఘ్రస్ఖలన ములకు ఆయుర్వేద చికిత్స పోస్టు ద్వారా చికిత్స కలదు
రావూస్ క్లినిక్
టి.బి. రోడ్, తెనాలి
ఫోన్సు: 8700, 4010

Suvarna Agencies Vijayawada